క్లుప్తంగా

రమాబాయి త్యాగనిరతి ఆదర్శనీయం



ముమ్మిడివరంలో మాతా రమాబాయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం: మాతా రమాబాయి జీవితాన్ని, ఆమె చేసిన త్యాగాన్ని మహిళలందరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ముమ్మిడివరం బుద్దపార్కులో ఏర్పాటు చేసిన మాతా రమాబాయి విగ్రహాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కాకినాడ లైఫ్ లైన్ అధినేత విగ్రహ దాత కోరుకొండ భానుమతి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ భవనంలో మాతా రామాబాయి మహిళా సంఘం వ్యవస్థాపకురాలు పుణ్యమంతుల రజని ఆధ్వర్యంలో మాతా రమాబాయి జయంతిని నిర్వహించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, షాస్ రేంజర్లు రాజేష్, మాలమహానాడు జాతీయ అధ్యక్షురాలు మంచాల మల్లేశ్వరి, అంబేడ్కర్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ చెల్లి అశోక్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా పాండురంగ స్వామి విగ్రహం పునఃప్రతిష్ఠ

ముమ్మిడివరం: ముమ్మిడివరం పెద వంతెన వద్ద గల శ్రీరుక్మాంబ సమేత పాండురంగ స్వామి ఆలయం, విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమాన్ సుదర్శనం వెంకటజనార్దనాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య యజమానులు విళ్ల ఈశ్వరరావు, మాధవి, విళ్ల గణేష్ ఎ. సౌజన్య దంపతులతో శ్రీరుక్మాంబ, సమేత పాండురంగ స్వామి విగ్రహాలకు ఉప ఆలయాల్లో అన్నపూర్ణదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, ఉమా దేవి సమేత సూర్యనారాయణస్వామి, రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, శ్రీలక్ష్మి నారాయణస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహాలను యర్రం శెట్టి వెంకటేశ్వరరావు, చోడపనీడి బాలకృష్ణ,ఏడిద శ్రీరామచంద్రమూర్తి, కొమ్మిరెడ్డి వీర వెంకట సత్యరామ సుబ్రమణ్యం, పెన్మత్స సురేష్‌వర్మ, మట్టపర్తి శ్రీనివాసరావు, నరహరి శెట్టి రామ్‌వినీల్, రవి ఆసెట్టి రామసుబ్బరావు దంపతులతో వైభవంగా ప్రాణ ప్రతిష్ఠ పూజలు జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం దృష్టి కళావాహన శాంతి కల్యాణం, అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినికిడి లోపం గల విద్యార్థికి ఉచిత వైద్యం

అమలాపురం టౌన్: భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి శతాబ్ది ఉత్సావాల్లో భాగంగా అమలాపురం డివిజన్ సమితి కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో 24 రోజులుగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ డివిజన్‌లో 24 పాఠశాలల్లో 24 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎడమ చెవి వినికిడి లోపంతో బాధపడుతున్న మామిడికుదురు మండలం పాశర్లపూడి లంక మండల ప్రాథమిక పాఠశాల అయిదో తరగతి విద్యార్థి యు.ఆశిస్‌కు సత్యసాయి సేవా సమతి ద్వారా ప్రత్యేక ఉచిత వైద్యం వైద్యం అందిస్తున్నట్లు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆ పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విద్యార్థి ఆశిస్ వినికిడి లోపాన్ని గుర్తించిన డాక్టర్ ప్రభాకర్ అమలాపురంలోని తన క్లినిక్‌కు శుక్రవారం రప్పించి అతడికి అవసరమైన మందులు, పరికరాలు ఉచితంగా అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరాల్లో విద్యార్థులకు దంత, చెవి, ముక్కు, గొంతు వైద్య విభాగాలకు వైద్యులు ఉచిత వైద్యం అందిస్తున్నారు.

గాయపడ్డ ఆయాకు ఆర్థిక సాయం అందజేత

అమలాపురం టౌన్: అంబాజీపేట మండలం కె.పెదపూడికి చెందిన బేబీ సీతామహాలక్ష్మి ఓ అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానిక విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు ఆమెను శుక్రవారం పరామర్శించి రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. బాధితురాలు బేబీ సీతా మహాలక్ష్మి తల్లి బళ్ల చంద్రావతి విద్యా నిధి విద్యా సంస్థలో ఆయాగా పనిచేస్తోంది. ఆమెది పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు సాయం అందించినట్టు కరస్పాండెంట్ శ్యామల మహాలక్ష్మి తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుబ్బారాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ సుధీర్‌బాబు, స్కూలు ప్రిన్సిపాల్ నాగ మాధవి పాల్గొన్నారు.

నేడు బాలాజీనగర్‌లో వేంకటేశ్వరుని కల్యాణం

తాళ్లరేవు: స్థానిక బాలాజీనగర్‌లో వేంచేసియున్న అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి(చిన్న వెంకటేశ్వరస్వామి) దివ్య కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి 48వ వార్షికోత్సవాలు శనివారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. వీటిలో భాగంగా ఉదయం విగ్రహ కలశస్థాపన, ధ్వజారోహణ, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి ఏడు గంటలకు వేద పండితులు, భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అన్నదాతకు అండ.. e-పంట

- పంటలకు ఈ–కేవైసీ, ఈ–క్రాప్ తప్పనిసరి
- వ్యవసాయ శాఖ పోర్టల్‌లో వివరాల నమోదు
- ఈ–క్రాప్ నమోదుకు ఫిబ్రవరి 15 చివరి తేదీ
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతుకు సహాయకారి

మండలం	పంట విస్తీర్ణం	ఈ–క్రాప్ (ఎకరాల్లో)
అమలాపురం	5,150	4,798
అల్లవరం	3,850	3,700
ఉప్పలగుప్తం	6,200	5,480



అమలాపురంలో మండలంలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బోస్‌బాబు

అమలాపురం రూరల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు ప్రకృతి విపత్తుల సమయంలో పరిహారం పొందాలంటే ఎంతో ముఖ్యమైన ఈ క్రాప్ నమోదుఅని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అమలాపురం నియోజకవర్గంలో పరిధిలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో ప్రస్తుతం రబీలో సీజన్‌లో వరి నాట్లు పూర్తి చేశారు. మరో వైపు ఈ– క్రాప్ నమోదు చేస్తున్నారు. నమోదు ప్రక్రియకు ఈనెల 15వ తేదీ చివరి తేదీ కావడంతో రైతులు త్వరపడాల్సిన అవసరం ఉంది. రైతులు తాము పండించే పంట వివరాలను ఈ– క్రాప్ నమోదు చేయించుకోకపోతే పంట చేతికి అందే సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించేందుకు అవకాశం ఉండదు.పండించిన ధాన్యం విక్రయించుకునేందుకు దళారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. పంట చేతికొచ్చే సమయాల్లో అప్పుడప్పుడూ విపత్తులు సంభవించి పంట నష్టపోయే పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. ఆ సమయంతో పంట నష్ట పరిహారం అందించారు.

నమోదు ఇలా..

పంటలు పండించే రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు, విపత్తుల సమయంలో ప్రభుత్వ సాయం పొందాలంటే ఎంతో ముఖ్యమైన ఈ క్రాప్ నమోదును అశ్రద్ధ చేయకూడదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో వరి నాట్లు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. మరో వైపు, ఈ–క్లాప్ నమోదు జరుగుతోంది. నమోదు ప్రక్రియకు ఈ నెల 15తేదీ చివరి తేదీ కావడంతో రైతులు తాము పండిస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవడానికి తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను వివరాలు అందించాలి. సాగు చేసే భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు వ్యవసాయ సహాయకులకు అందిస్తే వారు క్షేత్రస్థాయికి వచ్చి పంట వివరాలను సరి చేసుకుని వ్యవసాయ శాఖ పోర్టల్లో నమోదు చేస్తారు.

నిబంధనల సడలింపు



ఈ పంట నమోదు చేయించుకోవడం ఎంత ముఖ్యమో అంతే ముఖ్యం ఈ– కేవైసీ చేయించుకోవాలి. అప్పుడు మాత్రమే రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు, పరిహారాలు అందుతాయి. కౌలు రైతులకు గతంలో సాగు పత్రాలు ఇవ్వాలన్న నిబంధన ఉండేది. ప్రస్తుతం నిబంధనలు సడలించి క్షేత్రస్థాయిలో వాస్తవ సాగుదారులను గుర్తించి వారి పేరున ఈ– క్రాప్ నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

– కడలి ధర్మప్రసాద్,
మండల వ్యవసాయాధికారి,
అమలాపురం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులకు అభినందనలు



జిన్నూరి వెంకటేశ్వరరావు



వంగా గిరిజాకుమారి

ఉప్పలగుప్తం: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఉప్పలగుప్తం మండలం నుంచి ఇద్దరికి అవకాశం లభించింది. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు మరొకసారి నియమితులయ్యారు. వెంకటేశ్వరరావు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సైతం రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీకి సేవలందించారు. ప్రత్యేక జిల్లా ఏర్పడిన తరువాత రెండవసారి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా ఆయనను నియమించపడటం విశేషం. సన్నవిల్లి, నంగవరం గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు వంగా నాగగిరిజా కుమారి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఈమె గతంలో అమలాపురం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలుగా పార్టీకు సేవలందించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నుంచి ఇటీవల ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు నాయకులు వీరికి అభినందనలు తెలియజేశారు.

అల్లవరం సీహెచ్‌సీలో గుండెకు భరోసా



గుండెకు భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణరావు

అల్లవరం: గుండెపోటుకు గురైన సందర్భాల్లో సకాలంలో సత్వర వైద్యం అందినప్పుడే ప్రాణాలను నిలబెట్టుకోగలమని సీహెచ్‌సీ వైద్య నిపుణులు ఎం.లక్ష్మణరావు అన్నారు. అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ సరోజ ఆధ్వర్యంలో గుండెకు భరోసా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆయాసం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, దడ, స్పృహ కోల్పోవడం గుండెపోటుకు కారణం కావచ్చు. 60 ఏళ్లు పైబడిన వారిలో ఉబకాయం, పొగతాగడం, బీపీ, మధుమేహం ఉన్న వారిలో ఎక్కువ కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. గుండెపోటుకు గురైతే వారికి సాంత్వన చేకూరేలా సీహెచ్‌సీలో రూ. 45 వేలు విలువ చేసే టెనెక్టెప్లెస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంటుందని, ఇది పూర్తిగా ఉచితమన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ ఇంజెక్షన్‌పై అవగాహన కల్పించి వారి జీవితాలకు భరోసా కల్పించాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు సూచించారు. డాక్టర్ పృథ్వీ, గోడిలంక, బెండమూర్లంక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాలభైరవస్వామి తీర్థమహోత్సవం



సీతారామపురంలో కాలభైరవస్వామి

తాళ్లరేవు: మండలంలో ప్రసిద్ధిగాంచిన కాలభైరవస్వామి తీర్థ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ సెంటర్ ప్రాంతంలో ప్రతిష్ఠతమైన కాలభైరవస్వామి తీర్థం ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన వైభవంగా నిర్వహిస్తారు. ఏడు గ్రామాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ తీర్థ మహోత్సవానికి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్వామివారి తీర్థానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించా గ్రామ పెద్దలు, శ్రీకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

ఘనంగా గజమాల యాత్ర

అల్లవరం: అంతర్వేదిలోని లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు పురస్కరించుకుని స్వామివారికి, ఆల య నిర్మాత కొపనాతి కృష్ణమ్మకు సమర్పించను న్న గజమాల యాత్రను శుక్రవారం నిర్వహించా రు. రెండు గజమాలలను ఓడలరేవు నుంచి ప్ర త్యేక వాహనంలో అంతర్వేదికి తరలించారు. గజమాల యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ప్ర శాంత్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సరస్వతీ దేవి పూజ



బండారులంకలో సాముహిక సరస్వతీ దేవి పూజ చేస్తున్న విద్యార్థినులు

అమలాపురం రూరల్: బండారులంకలో పేరి రామేశ్వర శర్మ, బాసిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులతో శుక్రవారం సామూహిక సరస్వతీ దేవి పూజ నిర్వహించారు. జాన గణేష్ సరస్వతీ దేవి ప్రతిమలు, 1997–98 పదోవ తరగతి పూర్వ విద్యార్థులు లడ్డూలు, చింతా వరలక్ష్మి పెన్నులు పంపిణీ చేశారు. సర్పంచ్ పెనుమాల సునీత, పీఎంసీ వైస్ చైర్మన్ కూర్మా వీరవేణి, ఉప్పుగంటి భాస్కరరావు, చందన శంకరరావు, అక్కిశెట్టి శ్రీను, బాలమిత్ర సంఘం ప్రతినిధులు అంకం పెద రాజు, లక్కింశెట్టి ఫణి రాజు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం శ్రీను, హెచ్ఎం లక్ష్మి వెంకటబాల పాల్గొన్నారు.

అదనపు నీటి కోసం కలెక్టర్‌కు వినతి



కాకినాడ కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో సాగు, తాగు నీటి కోసం అదనపు వంతు జలాలను విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో యానాంలో నెలకొన్న సాగు, తాగునీటి ఎద్దడి సమస్యను వివరించారు. ప్రత్యేకంగా పిల్లంక ఫ్రెంచి కెనాల్, పత్తిగొంది కెనాల్ ద్వారా సాగునీటిని విడుదల చేయడం ద్వారా సమస్య నుంచి గట్టెక్కుతామని వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఏఈలు నాగరాజు, జ్యోతిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

బాలికల గురుకులంలో ఉపాధ్యాయులకు శిక్షణ

అల్లవరం: గోడిలోని బాలికల గురుకులంలోని ఉపాధ్యాయులకు శుక్రవారం ఆరోగ్యకమైన వాతావరణంలో విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిమ్స్, యూనిసెఫ్ సంయుక్త భాగస్వామంలో గురుకులంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒత్తిడిని అధిగమించడం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షాజద్, ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓడలరేవులో అక్రమంగా మద్యం విక్రయం

అల్లవరం: మద్యం షాపు పరిధిలో బెల్ట్ షాపుల నిర్వహిస్తే రూ.5 లక్షలు జరిమానా, రెండో సారి పునరావృతమైతే మద్యం షాపు లైసెన్స్ రద్దు చేస్తామని స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించినా ఏ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా బెల్ట్ నిర్వాహకులు మద్యం అమ్మకాలను జోరుగా నిర్వహిస్తున్నారు. అనధికార షాపులు నిర్వహిస్తూ ఏ మాత్రం భయం లేకుండా యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. ఓడలరేవులో మరిడమ్మ సెంటర్, వారపు సంత, ఏటిమోగ, ప్రాంతాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతోంది. బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయించేందుకు వేలంలో లక్షలు చెల్లించినట్టు తెలిసింది. ఇదంతా కూటమి నేతలు బృందంగా ఏర్పడి అనధికార మద్యం అమ్మకాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్, పోలీసులు కన్నెత్తైనా చూడడం లేదు. ప్రధాన రహదారి చెంతనే మద్యం విక్రయిస్తున్నా అధికారులకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బెల్ట్ షాపులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ రహిత యానాంకు కృషి చేయాలి

యానాం: యానాం సర్వేపల్లి రాధాకృష్ణన్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా యూనిట్, 1, 2 వలంటీర్లతో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్ననగర్‌లో అగ్నికులక్షత్రియ సీతారామ ఆలయం వద్ద, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్–2 యూనిట్ బృందం దత్తత తీసుకున్న కురసాంపేట పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్‌ను నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ రహిత యానాం సాధనకు వలంటీర్లు ప్లకార్డులను పట్టుకుని గ్రామస్తులతో కలిసి ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు చెల్లే నరేష్, ఎస్ శ్రీనివాస్, అధ్యాపకులు తాతపూడి ముత్యాలు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగ భద్రత కరువు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు తదితరులు

అల్లవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వివిధ విభాగాలకు చెందిన 36 మంది స్థానిక ఉద్యోగులను ఓఎన్‌జీసీ టెర్మినల్ నుంచి తొలగించారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లాడి ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఓడలరేవులో ముత్యాలమ్మ గుడి ఆవరణంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఓఎన్‌జీసీ టెర్మినల్‌లో స్థానికులకు అడుగడునా అన్యాయం జరుగుతోందన్నారు. ఓడలరేవులో 1990లో ప్రారంభమైందని, చమురు కార్యకలాపాలు మొదలుపెట్టిన నాటి నుంచి స్థానికులకు ఉద్యోగాల కల్పనలో ఓఎన్‌జీసీ మొండిగా వ్యవహరిస్తోందన్నారు. మాజీ ఉప హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో స్థానికులు 50 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని అప్పటి ఓఎన్‌జీసీ అధికారులు హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇటీవల ప్రోమోటెక్ కంపెనీ ఓడలరేవు గ్రామానికి చెందిన 32 ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి కేవలం ఐదుగురికి ఉద్యోగాలు మాత్రమే కల్పించి తీరని అన్యాయం చేసిందన్నారు. గ్రామానికి ఇస్తానన్న ఉద్యోగాలు భర్తీ చేయవలసిందేనని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. చొల్లంగి రాధాకృష్ణ మాట్లాడుతూ టెర్మినల్‌కు కోసం 375 ఎకరాల భూమిని రైతులు నుంచి తీసుకుందన్నారు. టెర్మినల్ నిర్మాణంతో డ్రెయినేజీ వ్యవస్థ మూసుకుపోయిందని, ఓఎన్‌జీసీ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో 200 ఎకరాల్లో కొబ్బరి, సరుగుడు తోటలు దెబ్బతిన్నాయన్నారు. డ్రెయినేజీ నిర్మించకుంటే చమురు కార్యకలాపాలు అడ్డుకుంటామని హెచ్చరించారు. అవనిగడ్డ శేషగిరిరావు మాట్లాడుతూ యడ్లరేవు నుంచి ఓడలరేవు వరకు తీరం పొడువునా రూ.130 కోట్ల నిధులతో గ్రోయిన్స్ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలుకాకపోవడంతో తీరం కోతకు గురవుతోందన్నారు. ప్రోమోటెక్ భర్తీ చేస్తానన్న 32 ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓఎన్‌జీసీ నుంచి లిఖిత పూర్వకం హామీ ఇవ్వకపోతే భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుర కుమారస్వామి చిలకలపూడి సూరిబాబు, ఏసు, లక్ష్మణరావు, మల్లాడి భాను, కె.త్రిమూర్తులు, పెచ్చెట్టి బాబ్జి పాల్గొన్నారు.

కామాక్షీ పీఠంలో వైభవంగా రాజ శ్యామల మహాయాగం



రాజ శ్యామల మహా యాగాన్ని నిర్వహిస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక కామాక్షీ పీఠ మహా సంస్థానంలో నిర్వహిస్తున్న శ్యామల నవ రాత్రుల మహోత్సవాల్లో తొమ్మిదో రోజు శుక్రవారం రాజ శ్యామల మహా యాగం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి కామేశ మహర్షి అనుగ్రహ భాషణతో మొదలైన నవరాత్రుల మహోత్సవాల్లో యాగాన్ని పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్ బృందం నిర్వహించింది. లోక కల్యాణం, విశ్వ శాంతి కోసం ఈ యాగాన్ని నిర్వహించినట్లు పీఠాధిపతి కామేశ మహర్షి వివరించారు. పీఠం బ్రహ్మ గోవిందవజ్ఝల నాగ భాస్కరశర్మ యాజ్ఞీకంలో వేద పండితులు యాగాన్ని ఆద్యంతం మంత్రోచ్ఛారణతో నిర్వహించారు. యాగం అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి ప్రక్రియలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం మేనేజర్ మర్రి దుర్గారావుతోపాటు భక్తులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: విలసవిల్లిలోని రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న రాజశ్యామల అమ్మవారి హోమం, పూజల్లో భాగంగా 9వ రోజు పూర్ణాహుతిని శుక్రవారం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. యాగకర్త రామకృష్ణ శర్మ మాట్లాడుతూ రాజ శ్యాయల అమ్మవారి యాగం నిర్వహించటంతో గ్రామం సస్యశ్యామలంగా ఉంటుందని వివరించారు. అనంతరం రోహిణీ నక్షత్ర జాతకులతో నేరేడు వృక్షానికి పూజలు చేసారు.

శాస్త్రోక్తంగా కూష్మాండ బలి సమర్పణ

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజ శ్యామల నవ రాత్రి ఉత్సవాల్లో కూష్మాండ బలి (గుమ్మడి కాయలను నరకడం) సమర్పణ శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవాలకు హాజరైన భక్తులు గుమ్మడి కాయలను మూడు ముక్కలు చేసి వాటిని కుంకుమ నీళ్లతో తడిపి అక్కడే 16 రోజులపాటు నిర్విరామంగా నిర్వహిస్తున్న రాజ శ్యామల యాగంలో వేసి పూజలు చేశారు. అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ ఆధ్వర్యం వహించారు. గో సేవకుడు గొవ్వాల అచ్యుతరామయ్య, బ్యాంక్ విశ్రాంత మేనేజర్ బళ్ల స్వామి వివేకానంద, మాచరమ్మ దంపతులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నా అందని సాగునీరు



ఎండిపోతున్న పంట పొలాల వద్ద మాట్లాడుతున్న రైతులు

యానాం: పంట పొలాలు ఎండిపోతున్నప్పటికీ సాగు నీరు అందించేందుకు కనీస చర్యలు చేపట్టకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యానాం పీడబ్ల్యూడీ అధికారుల తీరు దళిత రైతాంగంపై వివక్ష ప్రదర్శిస్తున్నట్లు ఉందని పలువురు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దరియాలతిప్ప ఆయకట్టు రైతులు సాగునీరు అందక ఎండిపోతున్న తమ పంట పొలాలను చూపిస్తూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యను విన్నవించేందుకు పీడబ్ల్యూడీ కార్యాలయానికి వెళితే తమను గేటు బయట ఉండాలంటూ అనుచితంగా అధికారులు వ్యవహరించారని ఈ ఘటన తమను మానసిక వేదనకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందించాల్సి ఉందని దీనిపై ముందస్తు ప్రణాళిక లేకుండా అధికారులు వ్యవహరించడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఎకరానికి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టామని ఆందోళన వ్యక్తం చేశారు. పీడబ్ల్యూడీ అధికారుల తీరుపై పుదుచ్చేరి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సాగునీటి సమస్య ప్రభుత్వం పరిష్కరించకపోతే మహా ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుకోటి నాగేశ్వరరావు, భైరవమూర్తి, కోరుకొండ ఆనందరావు, గిడ్ల వెంకన్న, బస్సా మాణిక్యాలు, మట్టా సత్యనారాయణ, మట్టా రాంబాబు, సబ్బతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు సీహెచ్‌సీలో టెనెక్టెప్లస్ ఇంజెక్షన్లు

తాళ్లరేవు: గుండెపోటు లక్షణాలు కనిపించిన మొదటి గంటలో చేసే రూ.45 వేల విలువైన టెనెక్టెప్లస్ ఇంజెక్షన్లు తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ స్నేహలత తెలిపారు. శుక్రవారం స్నేహలత మాట్లాడుతూ గుండెపోటుకు సంబంధించి భరోసా ఇచ్చే స్టెమ్ వైద్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎడమ భుజం లాగడం, ఛాతి నొప్పి, గుండెలో దడ, స్పృహ కోల్పోయి పడిపోవడం తదితర లక్షణాలు కనిపించిన గంటలోపు టెనెక్టెప్లస్ ఇంజెక్షన్లు చేస్తే రోగి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే ఈ వైద్యానికి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఈ ఇంజక్షన్లు తాళ్లరేవు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఉచితంగా ఈ ఇంజక్షన్లు చేస్తామని తెలిపారు. గుండెపోటు లక్షనాలను గుర్తించి సీహెచ్‌సీకి తీసుకువస్తే ఇంజెక్షన్లు చేస్తామని తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

మహా కుంభమేళ యాత్రకు బస్ సర్వీసులు

అమలాపురం రూరల్: మహా కుంభమేళ యాత్రకు వెళ్లేందుకు ఆర్టీసీ అమలాపురం డిపో నుంచి బస్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలు దేరుతుందన్నారు. మహా కుంభ మేళా బస్సు అమలాపురం డిపో నుంచి బయలుదేరి 8 రోజులుపాటు భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగరాజ్, కుంభమేళా, వారణాసి, అయోధ్య, గయ,బుద్ధ గయ, అరసవిల్లి, కూర్మం, త్రివేణి సంగమంలో స్నానం విశ్వనాథ దర్శనం, పిండ ప్రధానం చేయవచ్చుని తెలిపారు. ప్రయాగ రాజ్, కాశీ క్షేత్రాల్లో ఒక రోజు బస ఉంటుందన్నారు. ఒక్కరికీ టికెట్టు ధర రూ.10,800 ఉంటుందన్నారు. సరికొత్త సూపర్ లగ్జరీ వీడియో కోచ్‌లో వెళ్లవచ్చుని అన్నారు. వివరాలకు సెల్: 9959225576, 7382909620, 9908836444 నంబర్లను సంప్రదించాలన్నారు.

తమిళనాడులోనూ ఎన్ఆర్ కాంగ్రెస్ పోటీ

యానాం: పుదుచ్చేరి, తమిళనాడు ప్రజలు పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఉంచారని ఈ నేపథ్యంలో తమిళనాడులోనూ తమ నముదు రాజ్యం కాంగ్రెస్ (ఎన్ఆర్ కాంగ్రెస్) పార్టీ వచ్చే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు, సీఎం రంగసామి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్ఆర్ కాంగ్రెస్ 15వ వార్షికోత్సవ ఆవిర్భావ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. నియోజకవర్గాల వారీ కోఆర్డినేటర్లను నియమిస్తున్నట్లు ఇప్పటికే 11 మందిని నియమించామన్నారు. ప్రజల కోరిక మేరకు తమిళనాడులో కూడా తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నారని ఆయన తెలిపారు.

9న ఫైర్ డ్రైవర్ పోస్టుకు రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న ఫైర్‌మెన్, ఫైర్‌మెన్ డ్రైవర్ గ్రేడ్–3 పోస్టుల భర్తీకి ఈనెల 9న ఆదివారం పుదుచ్చేరి రీజియన్‌లో 5 కేంద్రాల్లో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డీపీ అండ్ ఏఆర్ కార్యదర్శి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పంకజ్ కుమార్ ఝా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే పరీక్షకు యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్ల నుంచి 2093 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. హాల్‌టికెట్‌లో పేర్కొన్న సెంటర్‌లో మాత్రమే పరీక్షకు అనుమతిస్తారని, అభ్యర్థులు తమ వెంట గుర్తింపుకార్డు తెచ్చుకోవాలన్నారు. హాల్‌టికెట్లను రిక్రూట్‌మెంట్.పీవై. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 0413–2233338కు ఫోన్ చేయాలన్నారు.